# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

DECEMBER - 2001

# సంక్షిప్త వార్తలు

అక్టోబరు నెలలో రెండు వారముల పర్యంతము భారతదేశములో సువార్త చాటి డాక్టర్ జాన్ బెయిలీగారు నవంబరు మొదటి తేదీనాటికి అమెరికా క్షేమముగా చేరుకొనిరి.

2001 అక్టోబరు 27వ తేదీ శనివారం రాత్రి గొల్లవిల్లిలో సహో. పాల్‌గూటం గారు ప్రభువునందు నిద్రించిరి. ఆయన భూస్థాపన కార్యక్రమం మరునాడు ఆదివారం జరిగెను. నవంబరు 10వ తేదీన గొల్లవిల్లిలో జ్ఞాపకార్థకూటము జరిగెను. దానిలో ప్రముఖముగ సోదరులు బొంతు ధనరాజు, జాషువా గూటం, సురేంద్రకుమార్ గార్లు పాల్గొనిరి. అంతేగాక ఆ ప్రాంతపు రాజకీయవేత్తలు, పురప్రముఖులు పలువురు హాజరై పాల్‌గూటం గారి సేవలను జ్ఞాపకం చేసికొనిరి.

2001 నవంబరు 6వ తేదీ మంగళవారం పశ్చిమగోదావరి జిల్లా సూరప్పగూడెంలో సోదరులు ఇంజేటి జేమ్స్ జయానందం గారు ప్రభువు నందు నిద్రించిరి. 10వ తేదీనాడు ఆయన జ్ఞాపకార్థకూటము అదే గ్రామములో జరిగెను. క్రీస్తుసంఘ సువార్తికులు, సభ్యులు, బంధువులు, మిత్రులు హాజరై ఆయన విడిచివెళ్లిన కుటుంబమునకు ఓదార్పు ననుగ్రహించిరి.

2001 నవంబరు 8వ తేదీనాడు తూర్పుగోదావరి జిల్లా ర్యాలి గ్రామంలో సువార్తికుల సదస్సు జరిగెను. ఈ సదస్సు కొరకు ర్యాలి స్థానిక క్రీస్తు సంఘము చక్కటి ఏర్పాట్లు చేసెను. ఉదయకాల కూటమునకు సోదరులు ఎ. విశ్వేశ్వరరావ్ (కొవ్వూరు) గారును, మధ్యాహ్నకాల కూటము నకు బిక్కవోలు బైబిలు స్కూల్ డైరక్టర్ యస్. జాన్ గారును అధ్యక్షత వహించి సదస్సును చక్కగా నిర్వర్తించిరి. సదస్సులో సోదరులు పి.యస్.ఆర్. జయపాల్, వి. రాజ్‌కుమార్, యస్.జాన్, జాషువా గూటం, ఎ. విశ్వేశ్వరరావ్ గార్లు చక్కటి వాక్యోపదేశము గావించిరి. ఆనాడు సహోదరుల ఐక్యత అను అంశము చర్చించబడెను. వచ్చిన వారందరు వాక్యమును బట్టి తగురీతిగ ప్రోత్సహించబడిరి. సోదరులు పి.యస్.ఆర్. జయపాల్ గారు,

# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

P.O. Box 80, Kakinada, A.P. 533 001

Phone : 0884 - 363722

Editor :

JOSHUA GOOTAM

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 22 డిసెంబర్ 2001 సంచిక 5


## యేసుక్రీస్తు దేవుని కుమారుడు - 1

(Jesus Christ, the son of God)

యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెననుటకు రుజువేమిటి యని అడిగితే, ఈరోజేయని ఒక్కమాటలో జవాబిచ్చేయ వచ్చును. యేసుక్రీస్తు పౌరాణిక వ్యక్తి కాదు. ఆయన చారిత్రాత్మక పురుషుడు. మానవజాతి చరిత్రకు ఆయన కేంద్రబిందువై యున్నారు గనుక చరిత్ర అంతయును క్రీస్తుపూర్వము అని గాని, క్రీస్తుశకము అనిగాని లెక్కింపబడుచున్నది. ఇప్పుడు మనము 2001వ సంవత్సరములో యున్నాము. ఈ వ్యాసమును ముద్రించుసరికి క్రీస్తు ఈ లోకమునకు వచ్చి 2001 సంవత్సరముల 12 మాసముల 10 రోజులైనది.

విచిత్రం యేమంటే ఈ లోకంలో జీవిస్తుయున్న ప్రతివ్యక్తి తాను చేయు ప్రతిపనికి క్రీస్తునే తెలియకుండా సాక్షిగా పిలుచుచున్నాడు. మనం ఎవరికి ఉత్తరం వ్రాసినా, డబ్బు అప్పు యిచ్చినా, పుచ్చుకున్నా, ఆస్థిని అమ్మినా, కొనినా, ఏదైనా ఒప్పందములు లిఖితపూర్వకముగా చేసికొన్నా మొదట ఆ కాగితాలపై తేదీవేస్తాము. అయితే ఆ తేదీ ఎవరిది ? ఆ తేదీ క్రీస్తుదే. అంటే యేసుక్రీస్తు ఈ లోకానికి వచ్చిన 2001వ సం॥లో, 12వ మాసములో 10వ తేదీన నీకు డబ్బు అప్పుయిచ్చాననో, లేక ఫలాన ఆస్తిని కొన్నాననో మనం క్రీస్తునే ముందుగ సాక్షిగా పిలుచుచున్నాము. నిజానికి మీరు క్రైస్తవులయినా, క్రైస్తవులుకాక పోయినా, దేవుని యందు విశ్వాసులైనా, కాకపోయినా క్రీస్తు లేకుండా మీ దైనందిన జీవితం గడువదు. అంతాఎందుకు ? ప్రతి వ్యాపారి తాను ఎక్కడైతే తేదీ వేస్తున్నాడో తనకు తెలియకుండానే క్రీస్తును సాక్షిగా పెట్టుకొనుచున్నాడు. వార్తాపత్రికల వారిని చూడండి. ఆ పత్రికలపై వారు మొట్టమొదట తేదీనే ముద్రిస్తారు. మనం కూడా ఆ పత్రిక ఏ రోజుదో చూచి మరీ చదువుతాము. విశ్వవ్యాప్తంగా ప్రచురితమయ్యే ప్రతి వార్తాపత్రికల వారు ముందుగా యేసు క్రీస్తునే సాక్షిగా పిలుస్తారు, పెట్టుకొంటారు.

## చరిత్ర గలవాడు

మానవజాతి చరిత్ర అంతా క్రీస్తును బట్టియే పరిగణించ బడుచున్నది గనుక ఆయన అసామాన్యమైన వ్యక్తి అని మనం గ్రహించుకోగలం. మరియు పురాణాల్లో యున్న వ్యక్తులవలె గాక ఈయన రాకపోకలను గూర్చిన నిర్దిష్టమైన చరిత్ర యున్నది. ఆయన ఎక్కడ పుట్టారో, ఎక్కడ పెరిగారో, ఎంతకాలం జీవించారో, యేమేమి చేసారో, ఎట్లు చనిపోయారో, అటు తరువాత యేమి జరిగిందో— ఈ వివరాలన్నీ చరిత్రపుటలలో యున్నాయి. వాటిని మనం ఈనాడు కూడా పరిశోధించి ఆయనను గూర్చిన వాస్తవాలను తెలిసికోవచ్చును.

గనుక యేసుక్రీస్తు ఈ లోకమునకు వచ్చెననుటలో సందేహము లేనేలేదు. ఇప్పుడు మనం క్రీస్తుశకంలో జీవించుచున్నాము!! అయితే, ఆయన ఈ లోకమునకు వచ్చినప్పుడు ఎందుకు వచ్చెను ? అనే ప్రశ్న మనకు ఉద్భవింప వచ్చును. దానికి జవాబుగా అపొస్తలుడు యిట్లు చెప్పుచున్నాడు: "పాపులను రక్షించుటకు క్రీస్తు యేసు లోకమునకు వచ్చెనను వాక్యము నమ్మతగినదియు పూర్ణాంగీకారమునకు యోగ్యమైనదియునై యున్నది. అట్టివారిలో నేను ప్రధానుడను" (1 తిమోతి 1:15). మరల "నిరాక్షేపముగా దైవభక్తిని గూర్చిన మర్మము గొప్పదైయున్నది; ఆయన సశరీరుడుగా ప్రత్యక్షుడయ్యెను. ఆత్మ విషయమున నీతిపరుడని తీర్పుపొందెను. దేవదూతలకు కనబడెను. రక్షకుడని జనములలో ప్రకటింపబడెను, లోకమందు నమ్మబడెను. ఆరోహణుడై తేజోమయుడయ్యెను" అని అతడు 1 తిమోతి 3:16లో వ్రాసెను.

## సశరీరుడు

యేసుప్రభువు ఈలోకంలో సశరీరుడుగా ప్రత్యక్షమాయెను. ఆయన బేత్లెహేము నగరంలో కన్యయైన మరియ గర్భమున మానవునిగ ఉద్భవింపక ముందు నుండే ఉనికి కలిగియుండెను. ఆయన ఆదినుండి "దేవుని స్వరూపము కలిగినవాడై యుండి, దేవునితో సమానముగా ఉండుట విడిచిపెట్టకూడని భాగ్యమని యెంచుకొనలేదు గాని, మనుష్యుల పోలికగా పుట్టి, దాసుని స్వరూపమును ధరించుకొని తన్నుతానే రిక్తునిగా చేసికొనెను. మరియు ఆయన ఆకారమందు మనుష్యుడుగా కనబడి, మరణము పొందునంతగా, అనగా సిలువ మరణము పొందునంతగా విధేయత చూపినవాడై తన్నుతాను తగ్గించుకొనెను" (ఫిలిప్పీ 2:5-8).

యేసుప్రభువు ఈలోకంలో ఉద్భవింపక ముందు వాక్యమైన దేవుడై యుండెను. "ఆదియందు వాక్యముండెను, వాక్యము దేవుని యొద్ద ఉండెను,

వాక్యము దేవుడై యుండెను. ఆయన ఆదియందు దేవుని యొద్ద ఉండెను. సమస్తమును ఆయన మూలముగా కలిగెను, కలిగియున్నదేదియు ఆయన లేకుండా కలుగలేదు", "ఆ వాక్యము శరీరధారియై కృపాసత్య సంపూర్ణుడుగా మనమధ్య నివసించెను; తండ్రివలన కలిగిన అద్వితీయ కుమారుని మహిమవలె మనము ఆయన మహిమను కనుగొంటిమి" (యోహాను 1:1-3;14).

యేసుప్రభువు ఈలోకంలో యుండగా తాను దేవుడనని, దేవుని కుమారుడనని నిరూపించుకొనెను. సరిగదా మానవులు ఆయనను అట్లు విశ్వసించాలని కోరుకొనెను. మరియు, "నేను ఆయనని మీరు విశ్వసింపని యెడల మీరు మీ పాపములలోనేయుండి మరణింతురని" హెచ్చరించెను (యోహాను 8:24). యేసుప్రభువు తాను జన్మించిన రీతిని బట్టి, తండ్రియైన దేవుడిచ్చిన సాక్ష్యమును బట్టి, చేసిన అద్భుతములు, మహత్కార్యములను బట్టి, చేసిన బోధలను బట్టి దేవుని కుమారుడని నిరూపించుకొనెను.

## క్రీస్తు జనన విధానము

"యేసుక్రీస్తు జననవిధ మెట్లనగా ఆయన తల్లియైన మరియ యోసేపునకు ప్రధానము చేయబడిన తరువాత వారేకము కాకమునుపు ఆమె పరిశుద్ధాత్మ వలన గర్భవతిగా ఉండెను. ఆమె భర్తయైన యోసేపు నీతిమంతుడై యుండి ఆమెను అవమాన పరచనొల్లక రహస్యముగా ఆమెను విడనాడ ఉద్దేశించెను. అతడు ఈ సంగతులను గూర్చి ఆలోచించు కొనుచుండగా, ఇదిగో ప్రభువు దూత స్వప్నమందు అతనికి ప్రత్యక్షమై దావీదు కుమారుడవైన యోసేపూ, నీ భార్యయైన మరియను చేర్చుకొనుటకు భయపడకుము, ఆమె గర్భము ధరించినది పరిశుద్ధాత్మవలన కలిగినది; ఆమె యొక కుమారుని కనును; తన ప్రజలను వారి పాపముల నుండి ఆయనే రక్షించును గనుక ఆయనకు

యేసు అను పేరు పెట్టుదువనెను. ఇదిగో కన్యక గర్భవతియై యొక కుమారుని కనును, ఆయనకు ఇమ్మానుయేలను పేరు పెట్టుదురు అని ప్రభువు తన ప్రవక్త ద్వారా పలికినమాట నెరవేరునట్లు ఇదంతయు జరిగెను. ఇమ్మానుయేలను పేరునకు భాషాంతరమున దేవుడు మనకుతోడని అర్థము. యోసేపు నిద్ర మేలుకొని ప్రభువు దూత తనకు ఆజ్ఞాపించిన ప్రకారము చేసి, తన భార్యను చేర్చుకొని ఆమె కుమారుని కనువరకు ఆమెను ఎరుగకుండెను; అతడు ఆ కుమారునికి యేసు అని పేరుపెట్టెను" (మత్తయి 1:18-25).

యేసు జన్మించిన సమయమందు, "ఆ దేశములో కొందరు గొర్రెల కాపరులు పొలములో ఉండి రాత్రివేళ తమమందను కాచుకొను చుండగా ప్రభువుదూత వారియొద్దకు వచ్చి నిలిచెను; ప్రభువు మహిమ వారిచుట్టు ప్రకాశించినందున వారు మిక్కిలి భయపడిరి. అయితే ఆ దూత-భయపడకుడి; ఇదిగో ప్రజలందరికిని కలుగబోవు మహాసంతోషకరమైన సువర్తమానము నేను మీకు తెలియజేయుచున్నాను; దావీదు పట్టణమందు నేడు రక్షకుడు మీ కొరకు పుట్టియున్నాడు; ఈయన ప్రభువైన క్రీస్తు. దానికిదే మీకానవాలు, ఒక శిశువు పొత్తిగుడ్డలతో చుట్టబడి యొకతొట్టిలో పండుకొని యుండుట మీరు చూచెదరని వారితో చెప్పెను. వెంటనే పరలోక సైన్యసమూహము ఆ దూతతో కూడ నుండి సర్వోన్నతమైన స్థలములలో దేవునికి మహిమయు, ఆయనకిష్టులైన మనుష్యులకు భూమిమీద సమాధానమును కలుగును గాక అని దేవునికి స్తోత్రము చేయుచుండెను.

"ఆ దూతలు తమయొద్ద నుండి పరలోకమునకు వెళ్లిన తరువాత ఆ గొర్రెలకాపరులు - జరిగిన యీ కార్యమును ప్రభువు మనకు తెలియజేయించి యున్నాడు; మనము బేత్లెహేము వరకు వెళ్లి చూతము రండని యొకనితోనొకడు చెప్పుకొని త్వరగా వెళ్లి మరియను, యోసేపును తొట్టిలో పండుకొని యున్న

శిశువును చూచిరి. వారుచూచి, యీ శిశువును గూర్చి తమతో చెప్పబడిన మాటలు ప్రచారము చేసిరి. గొర్రెలకాపరులు తమతో చెప్పిన సంగతులను గూర్చి విన్నవారందరు మిక్కిలి ఆశ్చర్యపడిరి. అయితే మరియ ఆ మాటలన్నియు తన హృదయములో తలపోసికొనుచు భద్రము చేసికొనెను. అంతట ఆ గొర్రెల కాపరులు తమతో చెప్పబడినట్టుగా తాము విన్నవాటిని కన్నవాటినన్నిటిని గూర్చి దేవుని మహిమపరచుచు స్తోత్రము చేయుచు తిరిగివెళ్లిరి" (లూకా 2:8-20).

ఈరీతిగ యేసుప్రభువు అద్భుతంగా కన్యయైన మరియ గర్భమున పుట్టెను. మరియ నజరేతు అను ఊరిలో దావీదు వంశస్థుడైన యోసేపను ఒక పురుషునికి ప్రధానము చేయబడెను. ఆమె కన్యక. అయితే దేవునిచే పంపబడిన "ఒక దూత లోపలికి వచ్చి, ఆమెను చూచి-దయా ప్రాప్తురాలా నీకు శుభము; ప్రభువు నీకుతోడై యున్నాడని చెప్పెను. ఆమె ఈమాటకు తొందరపడి ఈ శుభవచన మేమిటో అని ఆలోచించుకొను చుండగా, దూత-మరియా భయపడకుము, దేవుని వలన నీవు కృపపొందితివి. ఇదిగో నీవు గర్భము ధరించి కుమారుని కని ఆయనకు యేసు అని పేరుపెట్టుదువు; ఆయన గొప్పవాడై సర్వోన్నతుని కుమారుడనబడును; ప్రభువైన దేవుడు ఆయన తండ్రియైన దావీదు సింహాసనమును ఆయనకిచ్చును. ఆయన యాకోబు వంశస్థులను యుగ యుగములు ఏలును; ఆయన రాజ్యము అంతములేనిదై యుండునని ఆమెతో చెప్పెను. అందుకు మరియ-నేను పురుషుని ఎరుగని దాననే యిదేలాగు జరుగునని దూతతో అనగా-దూత పరిశుద్ధాత్మ నీ మీదికి వచ్చును; సర్వోన్నతుని శక్తి నిన్ను కమ్ముకొనును గనుక పుట్టబోవు శిశువు పరిశుద్ధుడై దేవుని కుమారుడనబడును----దేవుడు చెప్పిన యేమాటయైనను నిరర్థకము కానేరదని ఆమెతో చెప్పెను. అందుకు మరియ-ఇదిగో ప్రభువు దాసురాలను; నీ మాట చొప్పున నాకు జరుగునుగాక అనెను. అంతట దూత ఆమె యొద్దనుండి వెళ్లెను" (లూకా 1:24-38).

ఈరీతిగా ఒక పురుషునితో సంపర్కము లేకుండా కన్యయైన మరియ పరిశుద్ధాత్మ, దేవుని వలన గర్భము ధరించి కుమారుని కనెను. ఆయనే యేసుక్రీస్తు. యేసు అనగా రక్షకుడని, క్రీస్తు అనగా అభిషిక్తుడని అర్థము. ఆయన దేవుని కుమారుడు. స్త్రీ గర్భమున ఉద్భవించెను గనుక మనుష్య కుమారుడు కూడాను. మనలను రక్షించు నిమిత్తము ఈరీతిగా మానవావతారియై ఆయన ఈలోకమునకు వచ్చెను. ఆయనకు ముందుగాని, అటు తరువాతగాని ఒక కన్యక గర్భవతియైన సందర్భమును ప్రపంచములో ఎక్కడా కనుగొనలేము. ఆయన జన్మించిన విధానము ఆశ్చర్యము, అసామాన్యము, ఏలయనగా ఆయన దేవుని కుమారుడు !

❀❀❀❀

# దేవునిచే పంపబడిన మనుష్యుడు
## (God - sent Man)

దేవునిచే పంపబడిన మనుష్యుని గూర్చి మతశాఖల వారు తరుచు చెబుతారు. కొందరేమో తామే దేవునిచే పంపబడిన వారమని చెప్పుకొంటారు. అయితే బైబిలును తన చంకలో బెట్టుకొని కనబడు ప్రతివాడు దేవునిచే పంపబడిన వాడుకాదు. దేవుడతని పంపలేదు. అతని బోధనుకూడా ఆయన అనుమతించరు.

దేవునిచే పంపబడిన వానిని గుర్తించుట ఎట్లోనీకు తెలుసా ? దేవునిచే పంపబడినవాడు దేవుని మాటలే పలుకునని యోహాను 3:34లో మనము చదువగలము. మరియు యోహాను 17:17లో "నీ వాక్యమే సత్యమని" యేసు ప్రభువు చెప్పెను. యేసు క్రీస్తు దేవునిచే పంపబడినవాడని నీకోదేము గుర్తించెను. "బోధకుడా నీవు దేవుని నుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుమని" అతడు చెప్పాడు (యోహాను 3:2). యేసుక్రీస్తు దేవునిచే పంపబడినవాడని అపొస్తలుడైన యోహాను ప్రకటించాడు. "దేవుడు తన అద్వితీయ కుమారుని లోకములోనికి పంపెను" అని 1 యోహాను 4:9లో అతడు చెప్పాడు. "నన్ను పంపిన తండ్రి వానిని ఆకర్షించితేనే గాని యెవడును నాయొద్దకు రాలేడు" అని యోహాను 6:44లో యేసు చెప్పెను. అవును యేసు ప్రభువు దేవునిచే పంపబడినవాడు. ఆయన దేవుని మాటలనే పలికెను. ఏ బోధకుడైనా దేవునిచే పంపబడిన వాడైతే అతడు దేవుని మాటలనే పలుకును. "దేవుని యొద్దనుండి పంపబడిన యొక మనుష్యుడుండెను. అతని పేరు యోహాను" అని యోహాను 1:6లో మనము చదువగలము. అపొస్తలులు దేవునిచే పంపబడినవారు. "మీకు సమాధానము కలుగునుగాక, తండ్రి నన్ను పంపిన ప్రకారము నేనును మిమ్మును పంపుచున్నానని" యేసు వారితో చెప్పెను (యోహాను 20:21).

లోకమంతటికీ అపొస్తలులు సువార్త ప్రకటించారు. యేసు ప్రభువు అపొస్తలులకు గొప్ప ఆజ్ఞనిస్తూ, "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షించబడునని చెప్పెను" (మార్కు 16:16). దేవునిచే పంపబడిన అపొస్తలులు అట్లే బోధించారు. అయితే నమ్మిబాప్తిస్మము పొందినవాడు రక్షించబడునని నేటి మతశాఖల బోధకులు బోధించరు. సరిగదా నమ్మి రక్షించబడినవాడు బాప్తిస్మము పొందవచ్చునని వారు బోధిస్తారు. అందువలననే వారు దేవునిచే పంపబడిన వారు కాదని మనం గ్రహించుకొనగలము.

సువార్త రక్షించుటకు దేవుని శక్తియై యున్నదని దేవుని వాక్యము బోధించుచున్నది (రోమా 1:16). సువార్త ప్రకటించుట ద్వారా మానవులు రక్షించబడుదురు (1 కొరింథీ 1:21). అయితే సువార్త బోధింపబడకుండగనే పరిశుద్ధాత్మ ప్రభావము వలన మానవులు రక్షింపబడతారని కొందరు బోధిస్తారు. అందువలన అట్టివారు దేవునిచే పంపబడని వారని నేనెరుగుదును. దేవునిచే పంపబడిన వాడగు పౌలు (1 కొరింథీ 1:1), "ప్రభువైన యేసు తన ప్రభావమున్ను కనుపరచు దూతలతో కూడ పరలోకము నుండి అగ్ని జ్వాలలలో ప్రత్యక్షమై దేవుని నెరుగని వారికిని, మన ప్రభువైన యేసు సువార్తకు లోబడని వారికిని ప్రతిదండన చేయునని" చెప్పెను (2 థెస్స 1:7-9). మరికొంతమందేమో రక్షింపబడాలంటే సువార్తకు లోబడ నక్కరలేదని, విశ్వాసముంటే చాలునని బోధిస్తారు. అందువలన వారు దేవునిచే పంపబడిన వారుకారని నేనెరుగుదును. ఏలయనగా దేవునిచే పంపబడినవాడు దేవుని మాటలనే పలుకును.

దేవునిచే పంపబడిన వాడగు పేతురు, పెంతెకోస్తునాడు ప్రజలకు "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" యని చెప్పెను (అపొ.కా. 2:38). అయితే మతశాఖల బోధకులు నేడు అట్లు బోధించరు. గనుక వారు దేవునిచే పంపబడలేదని నేనెరుగుదును. దేవునిచే పంపబడినవాడు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రజలు బాప్తిస్మము పొందాలని చెప్పాడు. దేవునిచే పంపబడిన వ్యక్తి ఆయన మాటలనే పలుకుతాడు. ఏలయనగా దేవునిచే పంపబడిన వాడు దేవుని మాటలనే పలుకును (యోహాను 3:34).

సంఘము క్రీస్తు యొక్క శరీరమని పౌలు బోధించాడు (కొలస్స 1:18). ఆ ఒకే శరీరములో అనేకములైన అవయవము లున్నాయని కూడ అతడు చెప్పాడు (1 కొరింథీ 12:20). సంఘము క్రీస్తు శరీరమైనందున, క్రీస్తుకు ఒకే

ఒక్క శరీరమున్నందున, ఆయనకు ఒకేఒక్క సంఘమున్నది. గాని మతశాఖల బోధకులైతే క్రీస్తుకు కొన్ని వందల శరీరములున్నాయని చెబుతారు. వందల కొలది శరీరములున్నాయని చెప్పేవారు దేవునిచే పంపబడిన వారుకారు. క్రీస్తుకు కనీసము రెండు శరీరాలున్నాయని ఎవడైనా చెబితే వాడు దేవునిచే పంపబడినవాడు కాదు. అట్టివారికేమి జరుగుతాది ? గ్రుడ్డివాడు గ్రుడ్డివానికి త్రోవచూపిన యెడల వారిద్దరు గుంటలో పడుదురని యేసు బోధించారు. అందువలన మనం జాగ్రత్తగా యుండి ఆయా ఆత్మలు (బోధలు) దేవుని సంబంధమైనవో కావో పరీక్షించాలి (1 యోహాను 1:4).

--జాన్ హాంస్.

****

# క్రిస్మస్ పండుగ
## (Christmas Festival)

డిశంబర్ 25న యేసుక్రీస్తు జనన మహోత్సవము
జరుపుకొనుట కొందరికి వాడుక

యేసుక్రీస్తు తను జీవించి ఉన్న కాలములో అనగా 33 1/2 సంవత్సరములలో ఎన్నడును పుట్టుక దినము జరుపుకున్నట్టు చూడలేము. క్రిస్మస్ పండుగను గూర్చి పరిశుద్ధ గ్రంథములో ఏ ఒక్క వచనములోను మనకు కనిపించదు.

అలాంటప్పుడు క్రీస్తు జన్మదినము డిశంబర్ 25 అంటూ ఏ ఆధారము లేకుండా ఆ రోజున పండుగ దినముగా ఆచరించుట విచారకరము.

క్రీస్తు పుట్టకమునుపు కూడా డిశంబర్ 25న పర్వదినముగా తమ్మూజు పుట్టుకదినముగా ఆచరించేవారు. నిమ్రోదు రాజు.....యెహోవా యెదుట పరాక్రమము గల వేటగాడు. ఆనాటి కాలములో ప్రజలందరు నిమ్రోదును గూర్చి తానొక గొప్పవాడని చెప్పుకొనేవారు - బాబెలు గోపురాన్ని కూడ అతడే నిర్మించెను (ఆది 10:8-12; 11:1-9).

ఈ నిమ్రోదును గూర్చియు, తన భార్యను గూర్చియు తెలుసుకొనవలెనంటే మనము బైబిలును గాక వారిని గూర్చిన 'చరిత్రను' చూడవలెను. ఈ నిమ్రోదు భార్యపేరు సెమిరామిస్ అని 'చరిత్రలో' వ్రాయబడి యున్నది. ఆమె పేరు సెమిరామిస్, అదే పేరునకు 'అష్టార్టే', 'అష్టోరెట్' అనే నామాంతరాలు కూడ ఉన్నాయి. ఈమె ఊహామాత్రమైన ఆకాశరాణి, జనులామెకు ధూప, నైవేద్యాలు చేసేవారు (యిర్మియా 44:17-23).

ఒక దినమున నిమ్రోదు వేటకు వెళ్లినప్పుడు క్రూరమృగాలు అతనిని చంపివేసాయి. ఆ తరువాత సెమిరామిస్ ఆ నిమ్రోదే శిశువుగా తన గర్భములో ప్రవేశించాడని ప్రకటించింది. ఆ శిశువు పేరే తమ్మూజు (యెహెజ్కేలు 8:13-16).

ఆ శిశువు పుట్టినప్పుడే అనగా డిశంబర్ 24న, నిత్యము పచ్చగా వుండే ఒక చెట్టు కూడ రాత్రికి రాత్రే మొలచినట్టుగా చూపించింది. తమ్మూజ్ దగ్గర రకరకాల కానుకలు వుంచింది. నిమ్రోదే ఆ రూపములో సూర్యదేవర శరీరధారి అయినట్టు రూపకల్పన గావించింది, దాని ప్రకారమే యూల్ అను సూర్యదేవుని పండుగ దినమును క్రీస్తు పుట్టుక దినముగా మార్చడమువలనే క్రిస్మస్ వచ్చింది.

క్రొత్తనిబంధనలో లేని-క్రిస్మస్ పండుగ ఏలాగు అమలులోనికి వచ్చెను? తెలుసుకుందము. వాటి ఆరంభరీతి నెరుగుటకు మనము బైబిలును గాక, క్రిస్మస్ చరిత్రను చూడవలెను. క్రీ॥శ॥ 400 సం॥లో నుండియే క్రిస్మస్ పండుగ అమలులోనికి వచ్చెను.

కాన్స్టాంటైన్ అనే రోమా చక్రవర్తి ఒకసారి అతడు యుద్ధానికి వెళుతూ తను క్షేమముగా యుద్ధభూమి నుండి తిరిగి రాగలిగితే ఆ సమయానికి ఏ దేవుడైతే తనకు సాక్షాత్కరిస్తాడో ఆ దేవునిని అనుసరిస్తానని అనుకున్నాడు. అతడు యుద్ధభూమి నుండి క్షేమముగా తిరిగి వస్తుండగా ఆకాశవీధిలో ఒక సిలువగుర్తు అతనికి కనిపించిందట. అంతవరకు క్రైస్తవులను హింసించిన ఆ రోమా చక్రవర్తి క్రైస్తవ్యాన్ని స్వీకరించి, క్రీస్తు జన్మదినాన్ని డిశంబరు 25న ఆచరిస్తారని తెలుసుకుని ఆ తేదీని క్రీస్తు జన్మదినముగా ప్రకటించి, అప్పటివరకు ఏ పండుగను చెయ్యని క్రైస్తవులను క్రీస్తు జన్మదినాన్ని చెయ్యమని వత్తిడిచేసాడు. ఈ విధముగా 'క్రిస్మస్' పండుగ ఆచరణలోనికి వచ్చినట్లు 'చరిత్ర' సాక్ష్యము చెప్పుచున్నది.

ఆనాటి కాలములో చక్రవర్తులు, రాజులూ క్రైస్తవులుగా మారినారు. ఆ కారణమువలన ఆనాడు సెలవు దినముగా ప్రకటించినారని "చరిత్ర" చెప్పుచున్నది. క్రిస్మస్ పండుగ అనుమాట రోమన్ చక్రవర్తి కాన్స్టాంటయిన్ క్రైస్తవునిగా మారిన నాలుగోవ శతాబ్దములో నుండియే వింటున్నాము. గాని అంతకముందెన్నడూ దానిని ఆచరించినట్లు కనబడదు.

దైవగ్రంధమును, సామాజిక చరిత్రను....తరచిని పండితులే నేటి వరకు క్రీస్తు పుట్టుక తేదిని నిర్ణయించలేక యున్నారు. అయితే రోమన్ కేథలిక్కు వారితో ప్రొటెస్టాంటు శాఖలవారు దానిని ఆచరించడము విచారకరము.

ప్రపంచములోని ప్రొటెస్టాంట్ క్రైస్తవులు అనబడువారు నూటికి తొంబై శాతము క్రీస్తు డిశంబరు 25న పుట్టినాడని భావించి క్రిస్మస్‌ను ఆచరిస్తు ఉండుట మనము చూస్తున్నాము. క్రిస్మస్‌ను గూర్చిన అవగాహన లేకనే కొందరు దానిని ఆచరించుదురు. ప్రొటెస్టాంటులు ఎవరనగా కేథలిక్కు నుండి వేరైనవారు.

మరొక సంగతి, యేసుక్రీస్తు చేసిన అద్భుతములు 41, యేసుక్రీస్తు జన్మము, మరణము, పునరుత్థానము, ప్రవచనములు 38. వీటిలో క్రీస్తు జన్మదినమ్మున ఒక చెట్టు మొలచినట్లుగా ఏఒక్క ప్రవచనములలో వ్రాయబడ లేదు. ఈ చెట్టు 'చరిత్ర' అన్యులు తమ్ముజ్ జన్మదినమున మొలచినట్లుగా సెమిరామిస్ చెప్పెను (యోహాను 20:30-31 చదవండి).

డిశంబరు 25న ఒక పండుగగా క్రీస్తు పుట్టుకకు పూర్వమే రోమన్లు ఆచరించినట్లు 'చరిత్ర' చెప్పుచున్నది. ఆకాశరాణి అను ఒక దేవత వలన డిశంబరు 25న సూర్యుడు పుట్టినాడని వారు నమ్ముదురు. బబులోనీయులు కూడ దీనిని 5 దినములు ఆచరిస్తారు. ఐగుప్తీయులు డిశంబరు 25న సూర్యదేవునికి, చంద్రదేవతకు నక్షత్రదేవుడు పుట్టినాడు అనివారు ఆ తేదీన పండుగగా ఆచరిస్తారు. అరేబియాలో సెబియర్ అను జాతివారు చంద్రదేవతను ఆరాధిస్తారు, చంద్రుడు డిశంబరు 24న పుట్టినాడని నమ్ముదురు. ఇలాగున అన్యదేవతల జన్మదినమైన డిశంబరు 25న క్రీస్తు పుట్టుక దినముగా జరుపుకొనుట వింతగానే యున్నదని వారు ఆలోచించరు.

పాతనిబంధనలో నుండి ఇశ్రాయేలీయులు అనుసరించే పండుగలు... పంటచేని పండుగ, పులియని రొట్టెల పండుగ, ఏడు దినములు పర్ణశాలల పండుగ, ఏబది దినములు లెక్కించి పెంతెకొస్తు పండుగ ఇంక ఎన్నో పండుగలు

ఉన్నవి (ద్వితీ 16:9-17; నిర్గమ 12:17-20, 23:14-17; లేవీయ 23:15-42; అపొ.కా. 2:1). ఈ పండుగలు కేవలము ఇశ్రాయేలీయులకు దేవుడు ఇచ్చెను గాని అన్యులకు యివ్వలేదు (కీర్తన 147:19-20; ద్వితీ 5:1-22; నిర్గమ 20:1-17; ఎఫెసీ 2:12-20).

యేసు యూదా గోత్రములో పుట్టి ధర్మశాస్త్రమునకు లోబడి యున్నవారిని విడిపించుటకై ధర్మశాస్త్రమునకు లోబడినవాడాయెను (గలతీ 4:4-5; లూకా 2:21-39). ఆ పండుగలను, విధిరూపకమైన ఆజ్ఞలు గల ధర్మశాస్త్రమును యేసు తన శరీరమందు కొట్టివేసెను (ఎఫెసీ 2:14-16; 2 కొరింథీ 3:14-16; హెబ్రీ 8:7-13; 1 కొరింథీ 5:6-8; యిర్మీయా 31:31-34).

ఈ పండుగలు అన్నియు క్రీస్తు సంఘము అమలులోనికి వచ్చువరకు ఉండెను. క్రీ॥శ॥ 33సం॥లో యెరూషలేములో క్రొత్తనిబంధన సంఘము అనగా క్రీస్తు సంఘము ఆరంభమైనది. అపొస్తలుల ఆరాధనలో పాతనిబంధనలోనున్న పండుగలు వారు అనుసరించునట్లు ఎక్కడ వాక్యము కనిపించదు.

కొందరు క్రైస్తవులు పాతనిబంధనలోనున్న పండుగలు వాటిని పారంపర్యముగా ఆచరించుట చూచి పౌలు ఖండించెను. ఎట్లనగా మీరు పండుగ, అమావాస్య, విశ్రాంతి దినము ఆచరించుచున్నారు. ఇట్టి ఆచారములు చేయవద్దు..ముట్టవద్దు అను విధులకు మీరు లోబడనేల ? అవన్నియు వాడుకొనుటచేత నశించి పోవును (గలతీ 4:8-12; కొలస్స 2:16-23).

ఇశ్రాయేలీయులకు ఆయా పండుగలు చేయుమని చెప్పిన దేవుడే ఆమోసు కాలములో వాటిని చేయవద్దని చెప్పెను (ఆమోసు 5:21). మేము ప్రకటించిన సువార్త గాక, మరియొక సువార్తను ఎవడైనను మీకు చెప్పిన యెడల అతడు శాపగ్రస్తుడవును గాక (గలతీ 1:6-12). యేసు ఇట్లనెను,

ఈ ప్రజలు మనుష్యులు కల్పించిన పద్ధతులను...అనుసరించి వారు నన్ను వ్యర్థముగా ఆరాధించుచున్నారు (మత్తయి 15:7-9, 21-27; లూకా 6:46).

--వై. తాతారావు,
బరంపురం, ఒరిస్సా.

****

# యేసు చేసిన బోధనలు - 1

## (Jesus and His Teachings - 1)

యేసుక్రీస్తు ప్రజలకు ఉపమానముల ద్వారాను, ఉదాహరణల ద్వారాను ప్రశ్న-జవాబులద్వారాను అధికారముతోను అనేకరీతులుగ ఆధ్యాత్మిక సంగతులను బోధించెనని గత పాఠములో మనము తెలిసికొని యుంటిమి. నిజానికి ఈ భూమిపై ఉద్భవించినవారిలో యేసుక్రీస్తు వంటి గొప్ప బోధకుడు ఎవడునులేడు. యేసు తననోటిమాట ద్వారాను, తన జీవితమాదిరి ద్వారాను తనను వెంబడించు శిష్యులు ఎట్లుండవలెనో చక్కగా బోధించెను. వచ్చే కొద్ది సంచికలలో యేసుచేసిన ఈ గొప్ప బోధనలను గూర్చి తెలిసికొందము. తెలిసికొనుటయేగాక ఆయన మాటల ననుసరించుటకు ప్రయత్నించెదము.

యేసు యొక్క బాల్యదశలో జరిగిన ఒక ప్రాముఖ్యసంగతిని గూర్చి లూకా ఒక్కడు మాత్రమే లూకా సువార్త 2:41-50లో వ్రాసెను. యేసు పండ్రెండేండ్లవాడై

యున్నప్పుడు పస్కాపండుగ నాచరించుటకై తన తల్లిదండ్రులతో కూడ యెరూషలేమునకు వెళ్లెను. యెరూషలేమునకు వెళ్లకముందే "బాలుడు జ్ఞానముతో నిండుకొనుచు ఎదిగి బలము పొందుచుండెను; దేవుని దయ ఆయన మీద నుండెను" అని లూకా 2:40లో వ్రాయబడి యున్నది.

## ఆధ్యాత్మిక చింతన

పస్కాదినములు తీరిన తరువాత యేసు యొక్క తల్లిదండ్రులు యెరూషలేము నుండి తిరిగి వెళ్లిపోయిరి. గాని ఆయన యెరూషలేములో నిలిచెను. దీనిని బట్టి ఆధ్యాత్మిక విషయాల్లో ఆయనకున్న ఆసక్తిని బాల్యదశలోనే ఆయన బయలుపరచెను. మూడు దినములైన తరువాత యేసు తల్లిదండ్రులు "ఆయన దేవాలయములో బోధకులమధ్య కూర్చుండి, వారి మాటలను ఆలకించుచు, వారిని ప్రశ్నలడుగుచు ఉండగా చూచిరి". దీనినిబట్టి ఆయన జాగ్రత్తగ ఆలకించువాడని, ఆత్మీయ సంగతులను తెలిసికొనుటలో గొప్ప ఆసక్తి కలవాడని బాల్యదశలోనే ఋజువుపరచెను. యేసువలె యౌవనస్థులు తమ బాల్యదినములలోనే దేవుని గూర్చి వినుటకును, తెలిసికొనుటకును ఆసక్తి కలిగియుండుట మంచిది. వారికి దేవుని గూర్చి బోధించు బాధ్యత తల్లిదండ్రులదే: "బాలుడు నడువవలసిన త్రోవను వానికి నేర్పుము. వాడు పెద్దవాడైనప్పుడును దాని నుండి తొలగిపోడు" అని దైవవేదము బోధించుచున్నది (సామె 22:6). "దుర్దినములు రాకముందే నీ బాల్యదినములందే నీ సృష్టికర్తను స్మరణకు తెచ్చుకొనుము" అని పరిశుద్ధాత్ముడు జ్ఞానియైన సొలోమోను ద్వారా పలుకు చున్నాడు (ప్రసంగి 12:1-2). యేసు క్రీస్తు బాల్యదినములయందే దైవచింతన కలిగిజీవించెను. నేటి మన బాల బాలికలకు దేవుని గూర్చిన సత్యమును బోధించుబాధ్యత మనపై మరింత యెక్కువ ఉన్నదని గమనింతము. యేసు చిన్నవయసు లోనే యెరూషలేము దేవాలయములోని బోధకులను ప్రశ్నలడుగుచుండగా "ఆయన మాటలు వినిన వారందరు ఆయన ప్రజ్ఞకును,

ప్రత్యుత్తరములకును విస్మయమొందిరి. ఆయన తల్లిదండ్రులు ఆయనను చూచి మిక్కిలి ఆశ్చర్యపడిరి. నీవు మాతోకూడ రాకుండ యెరూషలేములోనే ఎందుకు ఉండిపోతివి ? అని ఆయన తల్లి ఆయన నడుగగా, "నేను నా తండ్రి పనులమీద నుండవలెనని మీరెరుగరా ?" అని ఆయన వారితో చెప్పి పరలోక తండ్రియైన దేవుడాయనకిచ్చిన పనిని నిర్వర్తించే బాధ్యతను అప్పటికే గ్రహించి యుండెనని యేసు బయలుపరచెను. అయినను, పరలోకపు తండ్రికేకాదు, ఇహలోక తల్లిదండ్రుల యెడల కూడ బాధ్యత గలవాడనని యేసు ఋజువుపరచెను. "అంతట ఆయన వారితోకూడ బయలుదేరి నజరేతునకు వచ్చి వారికి లోబడి యుండెను. యేసు దేవుని కుమారుడే అయినను ఇహలోక తల్లిదండ్రులకు లోబడి గొప్పమాదిరిని మన కనుగ్రహించెను. పిల్లలు తమ తలిదండ్రులకు లోబడి యుండుట వారికి గొప్ప ఆశీర్వాదము. "పిల్లలారా, ప్రభువునందు మీ తల్లిదండ్రులకు విధేయులై యుండుడి; ఇది ధర్మమే", అని ఎఫెసీ 6:1లో వ్రాయబడియున్నది. "నీ దేవుడైన యెహోవా నీకనుగ్రహించు దేశములో నీవు దీర్ఘాయుష్మంతుడవగునట్లు నీ తండ్రిని నీ తల్లిని సన్మానింపుము" అను వాగ్దానముతో కూడిన మొదటి ఆజ్ఞ నిర్గమ 20:12లో వ్రాయబడియున్నది.

## పరిపూర్ణ అభివృద్ధి

బాల్యదశ నుండి యౌవనస్థునిగా యేసు పెరిగిన కాలమంతటిని భక్తుడైన లూకా గొప్ప భావముతో కూడిన నాలుగు మాటలలో మనకు వర్ణించెను. యేసు జ్ఞానమందును (అంటే మానసికముగాను), వయస్సునందును (అంటే శారీరకముగాను), దేవుని దయయందును (అంటే ఆత్మీయము గాను), మనుష్యుల దయయందును (అంటే సాంఘికముగాను) వర్ధిల్లుచుండెను అని అతడు వ్రాసెను (లూకా 2:52). ప్రతి మానవుడు ఈ నాలుగు విషయాల్లో అనగా మానసికముగాను, శారీరకముగాను, ఆత్మీయము గాను, సాంఘికము గాను అభివృద్ధిని క్రీస్తువలె కనుబరచవలెనని యేసు

తన జీవిత విధానము ద్వారా గొప్ప పాఠమును మనకు బోధించు చున్నాడు. మానవులట్లు అభివృద్ధి చెందగలిగిన యెడల పరిపూర్ణతను సాధించగలరు.

పాపము లేనివాడైనను యేసు బాప్తిస్మము పొందెను. బాప్తిస్మము పొందుటకు ఆయన యొర్దాను దగ్గరనున్న యోహాను యొద్దకు వచ్చెను. "అందుకు యోహాను - నేను నీచేత బాప్తిస్మము పొందవలసినవాడనై యుండగా నీవు నాయొద్దకు వచ్చుచున్నావా ? అని ఆయనను నివారింప జూచెను గాని యేసు - ఇప్పటికి కానిమ్ము; నీతి యావత్తు ఈలాగు నెరవేర్చుట మనకు తగియున్నదని అతనికి ఉత్తరమిచ్చెను. గనుక అతడాలాగు కానిచ్చెను" (మత్తయి 3:13-15).

## విధేయత

మనమయితే పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలెనుగాని ఏ పాపము లేని యేసు ఎందుకు బాప్తిస్మము పొందెను ? అని కొందరు అడుగుదురు. ఇక్కడ యేసు చెప్పిన మాటలలోనే దానికి జవాబున్నది. ఆయన నీతియావత్తును నెరవేర్చుటకు బాప్తిస్మము పొందెను. మరల, నీతి అనగా యేమిటి ? అనే ప్రశ్న మనకు రావచ్చును. దేవుని ఆజ్ఞలన్నియు నీతియని లేక న్యాయములని కీర్తనలు 119:172లో వ్రాయబడి యున్నది. గనుక యేసు దేవుని ఆజ్ఞలను నెరవేర్చు నిమిత్తము బాప్తిస్మము పొందెనని మనము ఇంకొక మాటలో చెప్పకొనవచ్చును. దేవుని నీతి యావత్తును నెరవేర్చుటకు దేవుని కుమారుడైన క్రీస్తే బాప్తిస్మము పొందవలసి వచ్చిన యెడల మానవులమైన మనము పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందవలసిన అగత్యత మరింత యెక్కువయున్నది. అందుకే "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" యని అపొ.కా. 2:38 మనలను ఆజ్ఞాపించుచున్నది.

యేసు బాప్తిస్మముపొంది ప్రార్థన చేసెను. ఇదంతయు చూచి దేవుడు తన సంతోషమును ప్రకటించెను. "యేసు ప్రార్థన చేయుచుండగా ఆకాశము తెరువబడి, పరిశుద్ధాత్మ శరీరాకారముతో పావురమువలె ఆయన మీదికి దిగివచ్చెను. అప్పుడు నీవు నా ప్రియ కుమారుడవు, నీయందు నేనానందించు చున్నానని యొక శబ్దము ఆకాశము నుండి వచ్చెను" (లూకా 3:21-22).

శోధనను ఎదుర్కొనుటకును, జయించుటకును యేసు దేవుని వాక్యమును ఉపయోగించెను. యేసు ఆకలి గొనగా శోధకుడు నీవు దేవుని కుమారుడవైతే ఈ రాళ్ళు రొట్టెలగునట్లు ఆజ్ఞాపించుమనెను. అందుకాయన మనుష్యుడు రొట్టెవలన మాత్రము కాదుగాని దేవుని నోటనుండి వచ్చు ప్రతిమాట వలనను జీవించును అని వ్రాయబడియున్నదనెను. మరల అపవాది, ఆయనను దేవాలయ శిఖరమున నిలువబెట్టి నీవు దేవుని కుమారుడవైతే క్రిందికి దుముకుము అని శోధించెను. అందుకు యేసు ప్రభువైన నీ దేవుని శోధింప వలదని మరియొక చోట వ్రాయబడియున్నదని వానితో చెప్పెను. మరల అపవాది, నీవు నాకు సాగిలపడి నమస్కారము చేసిన యెడల ఈ లోకరాజ్యము లన్నిటిని, వాటి మహిమను నీకిచ్చెదనని ఆయనతో చెప్పెను. అందుకు యేసు సాతానా, పొమ్ము, ప్రభువైన నీ దేవునికి మ్రొక్కి ఆయనను మాత్రము సేవింప వలెను అని వ్రాయబడి యున్నదనెను (మత్తయి 4:1-10). ఈ సందర్భములో యేసు లేఖనముల నెత్తిచూపించి అపవాదిని జయించుట మనము గ్రహించగలము. "కాబట్టి దేవునికి లోబడి యుండుడి, అపవాదిని ఎదిరించుడి, అప్పుడు వాడు మీయొద్దనుండి పారిపోవును" అని యాకోబు 4:7లో వ్రాయబడియున్నది. మనము దేవుని వాక్యమును ఎంత ఎక్కువ తెలిసికొన గలిగితే అంత ఎక్కువ అపవాది మననుండి పారిపోవును.

యేసు తన బాల్యదశ నుండియే మనకు తన జీవితము ద్వారా మంచి పాఠములను నేర్పించినట్లు మనము గ్రహించాము. వచ్చే పాఠములో ఆయన

నేర్పించిన పాఠములను మరికొన్ని తెలిసికొందము. ఈలోగా మీరు దేవుని యొద్దకు రండి. క్రీస్తు దేవుని కుమారుడని నమ్మండి. పాపములను విసర్జించండి. బాప్తిస్మము పొందండి. అప్పుడాయన మీ యొద్దకు వచ్చును.

--జాషువా గూటం.

❋❋❋❋

# విశాల దృక్పథ మతము

## (Broad minded Religion)

మతసంబంధముగా విశాల దృక్పథం కలిగియుండుట నేడు పరిపాటి అయిపోయినది. దేవుని గూర్చి క్రీస్తును గూర్చి, సంఘాన్ని గూర్చి బైబిలును గూర్చి క్రైస్తవ జీవితాన్ని గూర్చి విశాల దృక్పథం కలిగియుండుట గొప్పగా భావించ బడుచున్నది. అయితే దేవునికి ప్రీతికరముగా యుంటూ ఎంత విశాల హృదయం కలిగియుండగలము ? మనకు తీర్పుతీర్చు దేవుని వాక్యపు వెలుగులో విశాల దృక్పథం కలిగిన మతాన్ని పరిశీలించుదాం.

### నిష్కపటం చాలదు

మనం నిష్కపటంగా యున్నంతవరకు ఏమి నమ్మినా ఫరవాలేదని ఈ విశాల దృక్పథం గలవారు చెబుతారు. యిట్టి వేదాంతం ఎంత ప్రమాదకరమైనదో

పౌలు మనకు తెలియజేయుచున్నాడు. 2 థెస్స 2:10-11లో అతడిట్లు వ్రాసెను: "దుర్నీతిని పుట్టించు సమస్త మోసముతోను, నశించుచున్నవారిలో సాతాను కనబరుచు బలమును అనుసరించియుండును. ఇందుచేత సత్యమును నమ్మక దుర్నీతి యందు అభిలాషగల వారందరు శిక్షావిధి పొందుటకై అబద్ధమును నమ్మునట్లు మోసము చేయు శక్తిని దేవుడు వారికి పంపు చున్నాడు". ఒకడు నిష్కపటుడైనను అబద్ధమును నమ్మగలడా ? సత్యానికి అసత్యానికి గొప్ప వ్యత్యాసమున్నది. నిష్కపటత్వము వలన అసత్యము సత్యముగా మారునా ? కానేకాదు. అసత్యాన్ని నమ్మినందువలన మనం ఏలాగైనా రక్షింపబడుదుమా? లేదు, లేదు. వెయ్యిసార్లు కానేకాదు. సత్యమును నమ్మనివారు దుర్నీతియందు అభిలాషగల వారని పౌలు చెప్పుచున్నాడు.

"జెట్టి యైనవాడు పోరాడునప్పుడు, నియమ ప్రకారము పోరాడకుంటే వానికి కిరీటము దొరుకదు" అని కూడ పౌలు వ్రాసెను (2 తిమో 2:5). ఆయా క్రీడలలో పాలుపొందువారు, నియమాలను పాటించకుంటే విజయం సాధించ లేరు. మనందరం ఒకే స్థానమునకు వెళ్లుటకు ప్రయత్నము చేయుచున్నా మనునది నిజమే. అయితే పరలోకానికి వెళ్లాలంటే పోరాటం ఒక్కటే చాలునా? అట్లయితే మనం యేమి నమ్మినా పరవాలేదు. పోరాటం మాత్రమే సరిపోదు. మనం నియమ ప్రకారము పోరాడాలి. రక్షింపబడాలని కోరుచున్నట్లయితే బైబిలు ననుసరించాలి. భువి నుండి దివికి నడిపించే మార్గదర్శి అదొక్కటి మాత్రమే. "నన్ను నిరాకరించి నా మాటలను అంగీకరింపని వానికి తీర్పు తీర్చు వాడొకడు కలడు; నేను చెప్పిన మాటయే అంత్య దినమందు వానికి తీర్పు తీర్చును" అని యేసు చెప్పెను (యోహాను 12:48; 2 యోహాను :9 కూడా చదువుము).

గనుక నిష్కాపట్యము వలన అసత్యము సత్యముగా మారదు. క్రైస్తవులను హించించినప్పుడు పౌలు నిజంగా మంచే చేస్తున్నాననుకొన్నాడు (అపొ.కా.

9:15). దేవుని యెదుట అతడు మంచి మనస్సాక్షి గలవాడై జీవించాడు (అపొ.కా. 23:1). నజరేయుడైన యేసు నామమునకు విరోధముగా అనేక కార్యములు చేయవలెనని అతడు తలంచాడు (అపొ.కా. 26:9). అయినను అపొ.కా. 22:1-6ను బట్టి అతడు నశించుస్థితిలో యుండెను, రక్షింపబడవలసి యుండెను, క్రైస్తవుడు కావలసివచ్చెను.

మత సంబంధ పోరబాట్లు రక్షింపనేరవు. విమోచింపబడాలంటే మనకు సత్యం అవసరం. మనుష్యులందరు రక్షణ పొంది సత్యమును గూర్చిన అనుభవ జ్ఞానము పొందవలెనని దేవుడు కోరుచున్నాడు (1 తిమోతి 2:5). సత్యమునకు విధేయులవుట వలన మన ఆత్మలు పవిత్ర పరచబడతాయి (1 పేతురు 1:22). సత్యము మాత్రమే మనలను స్వతంత్రులనుగా చేయును (యోహాను 8:32).

## సంఘము ఒక్కటే

రెండవదిగా, విశాల దృక్పధ మతము అన్ని సంఘాలు మంచివే, ఏ సంఘములో యున్నా ఫరవాలేదని బోధించును. బైబిలు అనేక సంఘములను ఆమోదించుచున్నదని నమ్మువారు యిట్టి మాటలు చెబుతారు. "శరీరమొక్కటే" యని పౌలు వ్రాసెను (ఎఫెసీ 4:4). ఆ శరీరమే సంఘము (ఎఫెసీ 1:22-23; కొలస్స 1:18). "ఈ బండమీద నా సంఘమును కట్టుదును" అని యేసు చెప్పెను (మత్తయి 16:18). నా సంఘము అని ఏకవచనమునే ఆయన పల్కెను. మానవులు స్థాపించిన సంఘములు, క్రీస్తు సంఘము ఒకటేనా ? ఒకటేయని మానవులు వాదింతురు. శిరస్సు ఒక్కటే గనుక శరీరము కూడ ఒక్కటే. రెండు శిరస్సులు గల శరీరమేదైనను అసాధారణమైనది, వికృతమైనది. అట్లే శిరస్సు ఒకటే అయ్యుండి రెండు శరీరాలున్నను వికృతమైనదే. భౌతికంగా దీన్ని మనం గ్రహించగలము. మరి ఆత్మీయంగా ఎందుకు గ్రహించలేము ? సంఘము కొరకు క్రీస్తు చనిపోయెను. సంఘము కొరకు రక్తము కార్చెను

(ఎఫెసీ 5:25; అపొ.కా. 20:28). క్రీస్తు సంఘముతో సరియైన సంఘమును మానవుడు స్థాపించగలిగితే, క్రీస్తు చనిపోయినది నిష్ప్రయోజనము ! ఆయన మరణం వ్యర్థం !

మూడవదిగా, విశాల దృక్పథాన్ని బట్టి, నీవు నమ్మితే చాలు, బాప్తిస్మం ప్రాముఖ్యం కాదని కొందరు చెబుతారు. "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని యేసు చెప్పెను (మార్కు 16:16). బాప్తిస్మం అక్కర్లేకపోతే క్రీస్తు రక్షణ కొరకు దాన్ని ఎందుకు ముడివేసారు? నమ్మగానే రక్షణ పొందితే, యేసు చెప్పింది తప్పు ! అట్లయినప్పుడు ఎవరో ఒకరు అబద్ధ బోధ చేయుచున్నారు. బాప్తిస్మానికి ముందే రక్షణవస్తే, పేతురు కూడ తప్పే. ఏలయనగా, "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి" యని అతడు చెప్పాడు (అపొ.కా. 2:38). పేతురు అబద్ధ బోధకుడా ? బాప్తిస్మమునకు ముందు పాపక్షమాపణ సంభవిస్తే, మారుమనస్సుకు ముందే కూడ అది సంభవించును !

## మానవ భావాలు పనికిరావు

నాల్గవదిగా, నీవు చేసేది కాదు గాని, నీవు తలంచేది ప్రాముఖ్యమని విశాల దృక్పథం గలవారు చెబుతారు. బైబిలు యేమి చెప్పినా, నా హృదయ భావాలు (feelings) నాకు ప్రాముఖ్యమని చెప్పేవారు చాలామంది యున్నారు. యొర్దాను నదిలో స్నానం చేసినంత మాత్రాన తన కుష్ఠురోగం పోదని నయమాను తలంచాడు. గాని అతడు తప్పు ! క్రీస్తు సంఘమును హింసించుచు తాను మంచే చేస్తున్నానని పౌలు తలంచాడు. గాని అతడు తప్పు ! మనము "వెలి చూపువలన కాక విశ్వాసము వలననే నడుచు కొనుచున్నామని" పౌలు చెప్పెను (2 కొరింథీ 5:6). తనకు తెలిసే యుండాలి. రక్షణను మనకుగా

మనం సంపాదించుకోలేము, గాని దాన్ని పొందడానికి మనం కొంత చేయాలి. "భయముతోను, వణకుతోను మీ సొంత రక్షణను కొనసాగించుకొనుడి" యని పౌలు చెప్పాడు (ఫిలిప్పీ 2:12). "మూర్ఖులగు ఈ తరము వారికి వేరై రక్షణపొందుడి" యని పేతురు హెచ్చరించాడు (అపొ.కా. 2:40). తనకు విధేయులైన వారందరికీ క్రీస్తు నిత్యరక్షణకు కారకుడు (హెబ్రీ 5:9). క్రైస్తవులు వినువారు మాత్రమే గాక వాక్య ప్రకారము చేయు వారైయుండాలి (యాకోబు 1:22).

మిత్రుడా, ఆత్మీయ విషయాల్లో విశాల దృక్పథం నాశనమునకు పోవు విశాల మార్గములో నిన్ను పయనింపజేస్తాది (మత్తయి 7:13-14). దేవుని మార్గము ఎల్లప్పుడు, ఇరుకైనదే, సంకుచితమైనదే (లూకా 13:24).

--జాన్ స్టేసీ.

❋❋❋❋


## క్రైస్తవ కీర్తనలు

237 పాటలు గల క్రైస్తవ కీర్తనలు పుస్తకం మరల ముద్రింపబడినది. దానిలో అనేక పాత, క్రొత్త కీర్తనలున్నవి. సత్యవాణిలో ప్రసారము చేయబడుచున్న కీర్తనలు కూడా యున్నవి. ఒక్కొక్క కాపీవెల 18 రూపాయలు. పోస్టేజీ 4 రూపాయలు అదనం. వలయువారు దిగువ చిరునామాకు M.O పంపండి. M.O దిగువ కూపను మీద మీ అడ్రసు తప్పక వ్రాయండి:

SATYA VANI, P.O.BOX-80, KAKINADA - 533 001.

వారి బృందము చక్కటి భోజనపానాదుల నేర్పాటు చేసిరి. ర్యాలిలోను, పరిసర ప్రాంతములలోను జయపాల్ గారు క్రీస్తుకొరకు, ఆయన సంఘము కొరకు గొప్ప కృషి చేయుచున్నారు.

నవంబరు 9వ తేదీ శుక్రవారం ఉదయం సింగంపల్లిలో జాన్ డీన్ సత్యవాణీల వివాహము ఘనముగా జరిగెను. జాన్‌డీన్ గారు సోదరులు యమ్. సామ్యూల్ రాజు గారి జ్యేష్ట కుమారుడు. ఆ వివాహమునకు వందలాది ప్రజలు, ప్రముఖులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించిరి; సామ్యూల్ రాజు గారిని అభినందించిరి.

నవంబరు 10వ తేదీ శనివారం ఖమ్మం జిల్లా బండారు గూడెం (మణుగూరు) లో యున్న క్రీస్తు సంఘము తన వార్షిక దినోత్సవమును జరిపించు కొని సువార్త కూటము నేర్పాటు చేసికొనిరి. ఆనాడు పలు స్థానిక సంఘముల నుండి 500 మంది అక్కడ హాజరైరి. కూటము అనంతరము 27 మంది క్రీస్తు లోనికి బాప్తిస్మము పొందిరి. వచ్చిన వారందరికీ స్థానిక క్రీస్తు సంఘము భోజనము నేర్పాటు చేసిరి. బండారు గూడెంలో సోదరులు పి. సురేంద్రకుమార్ గారు సువార్త చాటుచున్నారు.

సోదరులు జాన్ బెయిలీగారు అమెరికా తిరిగి వెళ్లకముందు అక్టోబరు 27వ తేదీనాడు కృష్ణా జిల్లా మైలవరం - వెల్వడం లో యున్న సంఘములో వాక్య పరిచర్యచేసిరి. ఆ కూటమునకు పరిసర ప్రాంతముల సువార్తకులు కూడ హాజరై సహవాసములో పాలుపుచ్చుకొనిరి. మైలవరం ప్రాంతములో సోదరులు టి. ప్రసాదరవ్ గారు పలు సంవత్సరములుగా సువార్త చాటుచున్నారు. అక్టోబరు 28వ తేదీ ఆదివారం జాన్ బెయిలీ గారు విజయవాడలో సోదరులు జాన్ బాలసుందరం గారి ఆధ్వర్యమున నడిపించబడుచున్న మూడు స్థానిక సంఘాలలో (అనగా గులాబితోట, సీతారాంపురం, రాణిగారితోట లో యున్న సంఘాలలో) వాక్య పరిచర్యచేసిరి. స్థానిక సువార్తికులను అభినందించిరి. అక్టోబరు 16వ తేదీ నాడు జాన్ బెయిలీ గారు బిక్కవోలు బైబిలు స్కూలును సందర్శించి అక్కడ తర్ఫీదు పొందుచున్న విద్యార్థులకు వాక్యపరిచర్య చేసిరి. బైబిలు స్కూలును చక్కగా నడుపుచున్న సోదరులు యస్. జాన్ గారిని అభినందించిరి. ఆ మరునాడు ఆయన కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్‌ను కూడ సందర్శించి దాని డైరక్టర్

నెహెమ్యా గూటం గారితో ఇంచుమించు మూడు గంటలసేపు భారతదేశ సువార్త పనిని గూర్చి ముచ్చటించిరి. జె.సి. బెయిలీ గారు మృతి జెందినను ఆయన కుమారుడు జాన్ బెయిలీ గారు భారతదేశ పర్యటన గావించి నందుకు ఆయనకు అభినందనలు.

నవంబరు 12,13 తేదీలలో తూర్పుగోదావరి జిల్లా చేయ్యేరులో సువార్త కూటములు జరిగెను. దానిలో యస్.యమ్. జయరాజన్ (రేపల్లె), బి. యోహాన్ (పల్లంకుర్రు) గార్లు వాక్యోపదేశముగావించగా, 13వ తేదీ మధ్యాహ్నం 14 మంది క్రీస్తులోనికి బాప్తిస్మము పొందిరి. చెయ్యేరులో సోదరులు యి.కె.వి. ప్రసాద్‌గారు సువార్త చాటుచున్నారు.


RNI Regd. No. 69973/98

Postal Regd. No. VM/KD/05/2001


**From:**

**SATYA VAKKU**
**P.O. BOX 80,**
**KAKINADA - 533 001**

**To**


Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St. KAKINADA - 533 004. Editor : JOSHUA GOOTAM.